క్లుప్తంగా

గర్భగుడి నిర్మాణ పనులు ప్రారంభం


రొద్దకాంబదేవి గర్భగుడి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రొద్దకాంబదేవి గర్భగుడి నిర్మాణానికి ఆదివారం తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్తంలో మొదటి గ్రానెట్ వేసి పనులు ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట దేవాలయ నిర్మాణానికి ఉపయోగించే గ్రానెట్‌ను భక్తిశ్రద్ధలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామున 5 గంటలకే శాంతి హోమంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరుబావి నుంచి ఎగసి పడుతున్న నీరు

అమరాపురం: మండల పరిధిలోని కెంకెర గ్రామంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఈరన్న తన నిధుల నుంచి ఆదివారం గ్రామంలో కొత్తగా బోరుబావిని తవ్వించారు. తాగునీరు సమృద్ధిగా పడడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈరన్నను గ్రామస్తులు అభినందించారు.

అంబేడ్కర్ భవన్ ఏర్పాటు చేయాలి

పెనుకొండ: జిల్లాలో అంబేడ్కర్‌భవన్‌తో పాటు అంబేడ్కర్ స్టడీసర్కిల్‌ను ఏర్పాటు చేయాలని పెనుకొండకు చెందిన దళిత సంఘం నాయకులు ఏ.వెంకటేశులు, న్యాయవాది రామకృష్ణ, మునిమడుగు నరసింహులు, కోనప్ప తదితరులు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ పుట్టపర్తి జిల్లాలో ఎస్సీలకు ప్రయోజనకరంగా ఉండేందుకు వీటిని నిర్మించాలని, ఇటీవల కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆయన కూడా సానుకూలంగా స్పందించారన్నారు.

'మన్‌కీ బాత్' సంబరాలు


కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం టౌన్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను వీక్షించిన తర్వాత స్థానిక లక్ష్మీపురంలోని శక్తికేంద్రం వద్ద బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే మోడల్ కాలనీలో 78, 79, 80 శక్తి కేంద్రాల్లో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుమతిసురాతిని ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అంతకు ముందు నంది విగ్రహం నుంచి నవోదయ విద్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మనసులో మాట కార్యక్రమాన్ని వీక్షించారు. నాయకులు వి.రవీంద్రనాథ్, హేమశ్రీ, దత్తురెడ్డి, హరీష్‌గుప్త, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఏకాగ్రత పెరుగుతుంది


కరాటే పోటీల్లో వివిధ రకాల బెల్టులు సాధించిన విద్యార్థులు

హిందూపురం: కరాటే శిక్షణతో ఆత్మరక్షణతో పాటు ఏకాగ్రత పెరిగి విద్యలో రాణిస్తారని ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ గ్రాండ్ మాస్టర్ రామచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక వాసవీవిన్నర్స్ స్కూల్‌లో విద్యార్థులకు కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఎల్లో, ఆరంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్ బెల్టుల కోసం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు రేయాన్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతా నమోస్తుతే!

- వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం
- అన్ని ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు

కన్యకాపరమేశ్వరీ జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో కొలువు దీర్చి భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.


హిందూపురం: పట్టణంలో ఆర్యవైశ్యుల బైక్ ర్యాలీ


హిందూపురం: పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో దర్శనమిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి

హిందూపురం: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం వాసవీమాతకు సుప్రభాతసేవ, తిరుమంజనసేవ , పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు బంగారు ఆభరణలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు చేశారు. వందలాదిమంది ఆర్యవైశ్య మహిళలు, భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో జరిగిన విశేష పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి భజన, సంకీర్తనలతో మంగళ హారతులిచ్చారు. తీర్థప్రసాదాలను, మిఠాయిలు భక్తులకు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్యవైశ్యులు దుకాణాలను మూసివేసి ఆలయం వద్ద నుంచి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. యువతీయువకులు జై వాసవీ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మెయిన్‌బజారు, గాంధీ సర్కిల్, ఎంఎఫ్‌రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్, రైల్వే రోడ్డు, విడిరోడ్డు గుండా తరలివెళ్లి అమ్మవారి ఆలయం వరకు సాగింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఉత్సవమూర్తిని ముత్యాల పల్లకీలో కొలువుదీర్చి నగరోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు జేపీకే రాము, శ్రీకాంత్, రవీంద్రుడు, రఘు, ప్రకాష్, శ్యాంబాబు, సునీల్, కుసుమపుత్రి భజన మండలి, వాసవీ మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని మడకశిర ప్రధాన రోడ్డు పక్కన నూతనంగా వెలసిన కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతి వేడుకలను ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కన్యకాపరమేశ్వరి చిత్రపటాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన మంటపంలో కూర్చొబెట్టి అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులను సమర్పించారు. గుడిబండ మండలం బైరేపల్లి చెందిన దాత బద్రీనాథ్, విజయలక్ష్మీ ఆలయ నిర్మాణానికి రూ.1,00,116 ప్రకటించారు. అందులో రూ.50,116 కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో వెలసిన ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను మేళా తాళాలతో పట్టణ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రతిమలను కూర్చోబెట్టారు. అర్చకులు నరసింహభట్టాచార్యులు, హరీష్ భట్టాచార్యులు అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో కూర్చొబెట్టి పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

మడకశిర: వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. కన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు కలశాలను తీసుకువచ్చి ప్రతిష్ఠింపజేసి అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర నామార్చన పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆర్యవైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మ వారికి హారతులు సమర్పించారు.

పెనుకొండ: పట్టణంలో ఆదివారం కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్యులు ఉదయం నుంచే అమ్మవారికి పెద్ద ఎత్తున పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్తుతిస్తూ మహిళలు గీతాలు ఆలపించారు. తర్వాత ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగిస్తూ పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. సుధాకర్ గుప్తా, నాగరాజు, సూర్య నారాయణ, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: వాసవి జయంతి సందర్భంగా స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. మహిళలు అమ్మవారిని స్తుతిస్తూ కీర్తనలు ఆలపించారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి పిండి దీపాలతో హారతి ఇచ్చారు. వాసవి మాత మూల మంత్ర పారాయణం, సహస్త నామ పారాయణం నిర్వహించారు. కన్యలకు పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని బంగారు రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదేశ్ కుమార్, ఉపాధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి అశోక్ కుమార్, అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రొళ్ల: అలంకరణలో వాసవీమాత


అమరాపురం: అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు


మడకశిర: కలశాలు తీసుకొస్తున్న మహిళలు


పెనుకొండ: పట్టణంలో నగర సంకీర్తనలో పాల్గొన్న ఆర్యవైశ్యులు


పావగడ: అలంకరణలో వాసవీ మాత



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)
హిందూపురం: 34.0
పెనుకొండ : 36.0
మడకశిర : 34.0

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

సోమందేపల్లి: మండలంలోని రేణుకానగర్, గుడ్డం నాగేపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ హాజరవుతారన్నారు.

శుభకార్యం

గోరంట్ల: వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీలర్ ఫారూక్ కుమార్తెతో పాటు రంగప్పమహల్‌లో జరిగిన నబీర సూల్ కుమారుడి వివాహ వేడుకలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పెనుకొండ: పట్టణంలోని నామా రామయ్య కళ్యాణ మండపంలో ఆదివారం రొద్దం మండలం బొమ్మిరెడ్డిపల్లికి చెందిన అంజనరెడ్డి కుమారుడి వివాహం జరిగింది. వివాహ వేడుకకు ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు తరగతులు

హిందూపురం టౌన్: ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థినులకు నేటి నుంచి ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కేజీబీవీలో ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన వారు తరగతులకు హాజరుకావాలన్నారు.

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం


మాట్లాడుతున్న డీన్ హెచ్‌వీ హేమకుమార్

మడకశిరరూరల్: రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంట సాగు చేసి అధిక దిగుబడులు పొందడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ హెచ్‌వీ హేమకుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు సందర్భంగా ఆదివారం ఆర్ ఆనంతపురంలో రైతు సదస్సు నిర్వహించారు. డీన్ మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు వినియోగించడం ద్వారా నీటిని ఆదా చేసి ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రతి రైతు బిందు పరికరాలను ఉపయోగించుకోవాలన్నారు. సర్పంచ్ అంజినమ్మ, పీఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, భూతన్న పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్‌లో చేరిక

హిందూపురం టౌన్: ఏపీటీఎఫ్ మండల స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక మేళాపురంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ పట్ల ఆకర్షితులై యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు మోహన్, ప్రభాకర్, ఆదినారాయణ నాయక్‌లు ఏపీటీఎఫ్‌లో చేరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ రాందాస్, జిల్లా ఆడిట్ కన్వీనర్ విజయ శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీనియర్ నాయకులు మల్లికార్జున, ముద్దు నాగప్ప, తిమ్మప్ప, గంగాధర్, ఫణి కుమార్, జగన్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్య శిబిరానికి స్పందన

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం హెచ్ఎం హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైఎస్సార్ జిల్లా ఎర్రముక్కలపల్లి హిమాలయ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ సుధాకర్ వంద మందికి పైగా థైరాయిడ్, నరాల సమస్య, కడుపు నొప్పి, తదితర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని పరీక్షించి అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, ఆసుపత్రి పీఆర్ఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ చిన్నరంగప్ప, స్కూల్ కమిటీ చైర్మన్ శివగంగప్ప తదితరులు పాల్గొన్నారు.

'మేడే' విజయవంతం చేయండి

మడకశిర: పట్టణంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే మేడే వేడుకలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఒక ప్రకటనలో కోరారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించి అంబేడ్కర్‌సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీశ్రీ రచనలు ప్రజా చైతన్యాన్ని రగిల్చాయి

పెనుకొండ: శ్రీశ్రీ రచనలు ప్రజా చైతన్యాన్ని రగిల్చాయని అధ్యాపకులు రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బ్రిలియన్స్ పాఠశాలలో ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో హరి అధ్యక్షతన మహాకవి శ్రీశ్రీ 113వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కవి చౌకా వ్రాసిన రావణ కాష్టం పుస్తక పరిచయ సభను నిర్వహించారు. అధ్యాపకులు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ కవి చౌకా రాసిన రావణ కాష్టం పుస్తకంలో దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో రాశారన్నారు. కార్యక్రమంలో రవూఫ్, సెడ్స్ బాషా, నరసింహ, గణేష్, ఇలియాజ్, బాబా, రామన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రాథమిక పాఠశాలకు దివంగత ఉపాధ్యాయుడు తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆదివారం పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ అంజినేయులు నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేసుకొని దాతల వచ్చిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.

'అండగా ఉంటామని మోసం చేశారు'

పావగడ: తన వద్ద ఆర్థిక లాభం పొంది తన వెంట నిలుస్తానని మాటిచ్చి చివరకు మాట తప్పిన నాయకుల చిట్టాను కేఆర్పీపీ అభ్యర్థి నేరళకుంటి నాగేంద్ర బహిర్గతం చేశారు. దీనికి సంబంధించి ఆయన మాట్లాడిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సి అంజినప్ప, వళ్లూరు చెన్నకేశవరెడ్డి, బి హొసహళ్లి చింతలరెడ్డి, ఎంకే నారాయణప్ప, మీన కుంటనహళ్లి నరసింహప్ప, జేడీఎస్ అక్కులప్పనాయుడు తనను మోసం చేసిన వారిలో ప్రముఖంగా ఉన్నారని ఆరోపించారు.

'బీజేపీ పథకాలనే కాంగ్రెస్ చెప్పుకుంటోంది'

పావగడ: కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలనే స్థానిక కాంగ్రెస్ నాయకులు తమవిగా చెప్పుకుంటూ తిరుగుతున్నారని రాష్ట్ర బీజేపీ రైతు మోర్చా కార్యదర్శి శివప్రసాద్ విమర్శించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో స్థానిక బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్‌కు ఓట్లు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

6 నుంచి భూతప్ప ఉత్సవం


ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని బసవనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ జరిగే భూతప్ప ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఆ పంచాయతీ పెద్దలు ఆహ్వాన పత్రికను అందజేశారు. 8 సంవత్సరాల తరువాత ఉత్సవాలు భారీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని టీటీడీ కళ్యాణ మంటపంలో ఆదివారం జరిగిన అనిల్‌కుమార్, రాధామణి వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండరు నాగభూషణరాజు, గేట్స్ ఇంజినీరింగ్ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. హిందూపురం సమీపంలోని కొల్లకుంట లోటస్ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, సువర్ణ భారతి విద్యాసంస్థల చైర్మన్ నీలకంఠారెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్, ట్రెజరర్ రవీంద్రారెడ్డి, లోటస్ స్కూల్ డైరెక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లిలో గ్రామస్తులు, దాతల సహకారంతో కరావళీశ్వర దేవాలయం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లి నివాసి, విశ్రాంత ఉపాధ్యాయుడు దేవాంగం శ్రీనివాసులు దంపతులు రూ.50 వేల విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జాబిలి'కి మిస్టర్ ఎక్సలెన్సీ పురస్కారం

పెనుకొండ: పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు, కవి, సాహితీవేత్త అయిన జాబిలి చాంద్‌బాషాకు మిస్టర్ ఎక్సలెన్సీ పురస్కారం దక్కింది. ఈ విషయాన్ని పురస్కార గ్రహీత ఆదివారం వెల్లడించారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అరబ్ అథర్స్ నిర్వాహకులు ఈ పురస్కారాన్ని అందించినట్లు పేర్కొన్నారు. సామాజిక కార్యక్రమాలు, సాహితీ ఘనతను గుర్తించి పురస్కారం అందజేశారన్నారు.


పావగడ కోటపై పాగా వేసేదెవరో?

- అసెంబ్లీ ఎన్నికల బరిలో 11 మంది అభ్యర్థులు
- విమర్శలు.. ప్రతి విమర్శలతో హోరెత్తుతున్న ప్రచారం


పావగడ మ్యాప్


తిమ్మరాయప్ప (జేడీఎస్)


వెంకటేశ్ (కాంగ్రెస్)


కృష్ణానాయక్ (బీజేపీ)


నాగేంద్ర (కేఆర్పీపీ)

పావగడ: కర్ణాటక రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల వేడి కొనసాగుతోంది. ఈనెల 10న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు తక్కువ సమయం ఉండటంతో అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే పావగడ కోటపై పాగా వేసేదెవరోనన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

బరిలో 11 మంది అభ్యర్థులు

పావగడ తాలూకాలో 1,92,087 మంది ఓటర్లు ఉండగా వీరిలో 98,489 మంది పురుషులు, 93,588 మంది మహిళలు, 10 మంది ఇతరులు ఉన్నారు. ఇక అభ్యర్థుల విషయానికొస్తే... మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. జేడీఎస్ తరఫున కేఎం తిమ్మరాయప్ప, కాంగ్రెస్ పార్టీ తరఫున హెచ్‌వీ వెంకటేష్, బీజేపీ తరఫున కృష్ణానాయక్, కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ తరఫున నేరళకుంటె నాగేంద్ర , ఆప్ తరఫున ఎన్ రామాంజినప్ప, భారతీయ బహుజన క్రాంతి దళ పార్టీ తరఫున బీటీ రామసుబ్బయ్య, కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ తరఫున సీఎన్ నరసింహరాజు, బీఎస్పీ తరఫున టీ హనుమంతరాయప్ప బరిలో ఉన్నారు. అలాగే స్వతంత్ర్య అభ్యర్థులుగా వీ.గోవిందప్ప, నాగరాజప్ప, శ్రీనివాసబాబు పోటీలో నిలిచారు.

ఆ రెండు పార్టీల మధ్యనే..

ఇదివరకు ఎన్నడూ లేనంతగా ఈసారి కాంగ్రెస్, జేడీఎస్ అభ్యర్థుల మధ్య హోరా హోరీ నెలకొంది. వ్యూహ ప్రతి వ్యూహాల్లో ఎవరి కెవరూ తీసి పోవడం లేదు. నియోజక వర్గం వ్యాప్తంగా ఈ రెండు పార్టీలకు బలాబలాలు సమానంగా ఉన్నాయి. అన్ని సామాజిక వర్గాలు రెండు పార్టీల అభ్యర్థులకే జై కొడుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. పావగడ నియోజకవర్గంలో ఎప్పుడు ఒకసారి గెలిచిన అభ్యర్థి తర్వాతి ఎన్నికల్లో గెలిచే సాంప్రదాయం లేదు. ఈ నేపథ్యంలో ఈసారి జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప గెలుపు తథ్యమని కొందరు అంటుంటే... ఆ సాంప్రదాయానికి కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్ చెక్‌పెడతాని మరికొందరు జోస్యం చెబుతున్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్ కూడా వారిద్దరికీ ధీటుగా ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ అభ్యర్థి నేరళకుంటె నాగేంద్ర సైతం తన దైనశైలిలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇందులో భాగంగానే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రచార పర్వాన్ని మరింత వేడెక్కిస్తున్నారు. ఏది ఏమైనా పావగడ కోటపై పాగా వేసేదెవరో అన్నది తెలుసు కోవాలంటే మాత్రం ఈ నెల 13న జరిగే కౌంటింగ్ వరకు ఆగాల్సిందే.

మడకశిరలో వర్షం

మడకశిరరూరల్: మడకశిర మండలంలో శనివారం 6.4 ఎంఎం, గుడిబండ 25,6 ఎంఎం, అమరాపురం 7 ఎంఎం, రొళ్ల 8,2 ఎంఎం, అగళి 8 ఎంఎం జల్లులతో కూడిన వర్షం పడింది. ఆదివారం సాయంత్రం పట్టణంలో జల్లుల వర్షం పడింది. ఈదుల గాలులతో కూడిన వర్షం జోరుగా పడితే కొత్త దశలో ఉన్న రాగి పంట నేలకు పడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.